అంగీకరించాలి" ధైర్యంగా కొండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పేశాడు.

గుర్నాథంతల్లి తెల్లబోయింది. ఏదో దిగులు, ఆశ్చర్యం వెలిబుచ్చింది కళ్ళల్లో.

"ఇంతబ్రతుకూ బ్రతికి, యింతచదువూ చదివి, చివరకు కిళ్ళీకొట్టు పెట్టుకుంటావుట్రా నాయనా" బ్రతిమాలింది ఆ అభిప్రాయం మానుకోమని. కాని గుర్నాథం భీష్మించాడు. తననిర్ణయానికి తిరుగు లేదన్నాడు.

"మీరు నీళ్ల కావిళ్లు మోసి, వంటలుచేసి సంసారం గడపలేదూ? నేను కిళ్ళీకొట్టు పెట్టుకుంటే అప్రతిష్ఠ వచ్చి పడిందా?" అని సవాల్ చేశాడు.

"అలా అయితే ముందుగా ఆ పిల్లకి చెప్పడ మెందుకూ?" అన్నది తల్లి. క్షణం ఆలోచించి సరేనన్నాడు గుర్నాథం.

పెళ్ళి లక్షణంగా జరిగిపోయింది. గుర్నాథం తనపంతం నెగ్గించుకున్నాడు.

* * *

గుర్నాథం పెళ్ళయి మూడేళ్ళయింది. ఒక పిల్లాడు. భార్యమళ్ళీ ఐదోనెల గర్భిణి. జీవితం వెనుకటివలెనే వున్నది. ఏమీ మార్పు లేదు. కిళ్ళీకొట్టు మీద ఏదో ఒక వందరూపాయలు దాదాపుగా వొస్తున్నాయి. కాస్త విశ్రాంతి ఎక్కువగావుండటం చేత బాగా తీరికగా కథలు, నాటికలు, వ్యాసాలు వ్రాస్తున్నాడు. దారితప్పి కొన్ని అచ్చు పడుతున్నాయి. అయినా ఆర్థికపరిస్థితిలో పెద్దమార్పేమీ రాలేదు.

ప్రఖ్యాత యువరచయిత, కథకుడు శ్రీ గుర్నాధరావు యీనాడు ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛగా ఒకకిళ్ళీకొట్టు పెట్టుకుని జీవిస్తున్నాడు. తిన్నా తినకపోయినా కోరికలు ఆశయాలు నెరవేరినా నెరవేరకపోయినా, కొత్తగా కాపరానికొచ్చిన నవయవ్వనాంగి, అర్థాంగి, ముద్దు ముచ్చట్లు తీరినా తీరకపోయినా, వృద్ధురాలైన తల్లి యీనాటికీ వంటలు చేయాల్సిన అవసరమొచ్చినా రాకపోయినా, చెల్లెలి పెళ్ళికి, తమ్ముడి పైచదువులకి డబ్బు మిగిల్చినా మిగల్చకపోయినా, గుర్నాథంతోగాని అతని జీవితంతోగాని ప్రభుత్వానికైతేనేం, ప్రజలకైతేనేం, జోక్యమనవసరం! అతను పరిపూర్ణమైన స్వేచ్ఛను అనుభవిస్తున్నాడు.

---

మానవ నైజం

# రూపాయిలు అణాలు పైసలు

మధిర భానుమూర్తి

ఒక మహనీయుని జీవితచరిత్ర చదువుతున్న రోజుల్లో ఒక మిత్రుడు వచ్చాడు. అతను నాకు చాలా సన్నిహితుల్లో ఒకడు. మా స్నేహం ఈ నాటిది కాదు. ఎంతోకాలంగా స్నేహితులం అవటంవల్ల మా ఇద్దరి మధ్యన ఏమీ దాపరికాలు లేవని చెప్పవచ్చు. అందుచేతనే అతను వస్తూనే "ఏమిటోయ్! అంత గ్రంథం తీసుకు తీవ్రంగా చదువుతున్నావ్?" అని ప్రశ్నించాడు. నేను వెంటనే చెప్పాను 'ఫలానా' వ్యక్తి జీవితచరిత్ర అని.

"ఏ పరీక్షకి పెట్టారు?" అని అడిగాడు అదుర్దాగా. ఈ పుస్తకం పరీక్షకి పెట్టడమేమిటా అని తెల్లబోయి చూస్తూన్నాను నేను. వెంటనే తనకు జవాబివ్వక తెల్లబోయి చూస్తున్న నా అవస్థను కనిపెట్టిన నా మిత్రుడు తన ప్రశ్నను వివరించాడు. "అదికాదు. నువ్వు ఇప్పుడు ఏపరీక్షకైనా కట్టావా?... ఈ పుస్తకం ఏదేనా పరీక్షకి పెట్టారా?...నువ్వు చదువుతుంటే అది ఏ పరీక్షకేనా పెట్టారేమో ననుకున్నాను...పాఠ్యగ్రంథం కాకపోతే చదవటం ఎందుకు?..." అని నాకు ఆశ్చర్యంవేసింది. పాఠ్యగ్రంథం అయితేనేగాని ఏ పుస్తకం చదవవలసిన అవసరం ఉండదనే నిశ్చయానికి వచ్చిన నా మిత్రుని వైఖరి చూస్తే కొందరి దృష్టిలో అంతే. ఏ పనేనా తాము చేస్తే దాని ఫలితం వెంటనే పొందగలగాలి. అలా

లేనప్పుడు ఆ పనులు చెయ్యడం అనవసరమంటారు. ఆ దృష్టితో చూస్తే ఏదేనా తగినంతగా తమ కుప యోగపడే విషయం ఉంటేనే తప్ప నిత్యం వార్తా పత్రికలు చూడవలసిన అవసరం సామాన్యంగా ఎవరికీ ఉండదన్నమాట. ఇలాగ ఈ సూత్రాన్ని మనం చేసే పనులన్నిటికీ అన్వయింప చేసుకుంటే మనం చేసుకునే పనుల్లో చాలవరకు మనం చెయ్యక్కర్లేదని తెలుస్తుంది. అదేదృష్టితో చూస్తే తమకు ఏవిధంగానూ ఉపయోగపడని పనులుచేసే వారంతా కేవలం వివేకం లేనివారని తేలుతుంది... ఇలాగ నేను ఆలోచించుకుంటుండగా మా మిత్రుడు నా ఆలోచనకి అంతరాయం కలిగించాడు.

"నన్ను ఈ ప్రక్క ఊళ్లో రేపు ఆదివారం ఒక ఉపన్యాసం ఇమ్మని వేచుకుటింటున్నారు. నీ అభిప్రాయం ఏమిటి?..."అని అడిగాడు.

"దేన్నిగురించి?..."నా వంతుకు నేనొకప్రశ్న వేశాను.

"విషయానికేంలే?...మహా భారతాన్నిగురించి అనుకో...కాని..."అంటూ నసిగాడు.

"ఇహనేం! ... ఇంకా సందేహ మెందుకు?" అన్నాను నేను. మహా భారతం మావాడికి కొట్టిన పిండి. పద్ధెనిమిది పర్వాలూ వప్పచెప్పమన్నా వప్ప చెప్పగలడు. అంతటి శక్తిఉంది. గ్రుడ్డిగా వప్ప చెప్పడమేగాక విమర్శన చెయ్యగలడు. భారతం లోని విశేషాలు మావాడు ఎన్నాళ్ళు చెప్పినా తరగవు. అంత క్షుణ్ణంగా చదివాడు. నిజానికి అతను భారతంగురించి ఉపన్యాసమిస్తాడని తెలిస్తే జనంకూడా బాగానే చేరుతారు. ఇన్ని తెలిసి ఉండబట్టే నేను ప్రోత్సహించాను.

"అదుగో అదే మీకూ నాకూ తేడా! పిలిచారు గదా అని పరుగెత్తడమేనా?...దాంట్లో ఎంత ఇది ఉంది...అసలు మన దేశమింకా బాగు పడాలోయ్!...ఎక్కడా సంస్కారం లేదుగదా ప్రజల్లో...ఇంతకాదు ఇంతకి పదింతలు చదువు కున్న వాణ్ణేనా మనదేశం గౌరవించలేదు. అసలు మన వాళ్ళకది చాతనయితేనా? ...ఎంతసేపూ ధర్మ డిబ్బీ ఉపన్యాసకులు కావాలి. విజ్ఞానానికి విలువ కట్టేశక్తి మనవాళ్ళకిలేదు. పాశ్చాత్య దేశాల్లో చూడు...ఎక్కడేనా ఒక ఉపన్యాసం ఉందంటే అక్కడికి సభాసదులు డబ్బుఇచ్చి టిక్కట్టు కొనుక్కుని మరీ వెడతారుట, మనం నాటకాలకీ, సినిమాలకీ వెళ్ళినట్టు, అలాగ సభాసదు లంతా ప్రవేశ రుసుముచెల్లించిన వాళ్లేఅయినప్పుడు ఆ ఉపన్యాసకుడుపడ్డ శ్రమవృథా అవక తృణమో పణమో ప్రతిఫలంకూడా ముడుతుందట. అలాంటి ప్రోత్సాహం ఉంటే ఎవడేనా కృషిచేస్తాడుగాని, ఏమీ లేకపోతే ఏం ఉత్సాహం ఉంటుంది? మన దేశంలో కూడా ఇలాంటి వ్యవస్థ ఏర్పడాలి. అప్పుడుగానినిజమైన విజ్ఞానులు బయటపడరు" అని ధ్వనించాడు మా మిత్రుడు.

"అందుకోసమని...నువ్వు వెళ్ళదలచుకోలేదన్న మాట!" అని అడిగాను నేను.

"అదికాదనుకో...."అంటూ నసిగాడు.

"మరి మీ యింట్లో ఏర్పాటుచేసిన వివాహం సందర్భంలో ఉపన్యాసాలిచ్చినవాళ్ళకి ఎంతెంత ఇచ్చావు?"అని అడిగాను.

నేను ఈ ప్రశ్న వెయ్యడంతోటే "నాకు కొంచెం పనుంది వస్తా...."అంటూ జారుకున్నాడు మిత్రుడు. అతని తత్వం అంతే. ఏదేనా తగినంత ప్రతిఫలం ముట్టేదయితేనే చేస్తాడు. లేకపోతే తనదికానట్టుగా తప్పించుకు తిరుగుతాడు.

ఈ రకం మనుషులు సర్వత్రా ఎందరో ఉంటారు. మా మిత్రుడు అలాంటివారికి ప్రతినిధి మాత్రమే. దీంట్లో అనుమానం ఎవరికేనా ఉంటే ఒక్క చందా వసూలుచేసే ఆసామీతో తిరిగి చూస్తే దాని యథార్థ స్థితి అందరికీ బాగా తెలుస్తుంది. చందాలు సత్కార్యానికే వసూలుచేస్తున్నప్పటికీ ఒక్కరూపాయేనా వెయ్యనివారెందరో ఒక పలుకుబడిగల వ్యక్తో, ఉంగరాల వ్రేళ్ళతో మొట్టగల వ్యక్తో అడిగితేమాత్రం ఆయన అడిగిన దానికంటె రెండింతల సొమ్ము చందావేసి వెంటనే ఆ సొమ్ము ఇవ్వడం ఎవరెరగనిది....అంటే ఆ ఘనులు వచ్చినప్పుడు ఆ చందావెయ్యడంవల్ల తమకు ఉత్తరోత్తరా కలిసివచ్చేదేదయినా ఉండ వచ్చుననిగాని, లేక ఆ చందా వెయ్యకపోవడంవల్ల తమకు రావలసినచోట్లనుంచి సరిగా సొమ్మురాదని గాని, కాక ఆ చందా ఇయ్యకపోవడంవల్ల తాము అనవసరంగా అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుందనిగాని ఇవ్వటం జరుగుతుందేగాని ఆ భయం